**COMMUNIST PARTY OF INDIA (MARXIST)**

**ANDHRA PRADESH COMMITTEE**

H.No. 27`28`12, CPI(M) State Committee Office
Yamalavari Street, Governor Pet, Vijayawada -2
☎ 0866 - 2577202, Fax: 0866 - 2577203
E-mail: cpimap@gmail.com

ప్రచురణార్థం/ ప్రసారార్థం : విజయవాడ,

తేది: 5 మార్చి, 2018.

## ఆత్మస్తుతి, అర్ధసత్యాల గవర్నర్ ప్రసంగం

బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఉభయ సభలనుద్దేశించి రాష్ట్ర గవర్నర్ నరసింహన్ చేసిన ప్రసంగంలో రాష్ట్ర ప్రభుత్వ ఆత్మస్తుతి, రాష్ట్ర పరిస్థితులు, పాలన పట్ల అర్ధసత్యాలతో నిండి ఉంది. ప్రభుత్వ పాలనా విధానానికి సూచికగా భావించే ఈ ప్రసంగంలో కీలకమైన రాష్ట్రానికి ప్రత్యేకహోదా, విభజన హామీల అమలు కోసం కేంద్రం పట్ల రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి వైఖరిని తీసుకుంటుందో స్పష్టం చేయకుండా దాగుడుమూతలు కొనసాగించడం గర్హనీయం.

కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకహోదాకు మంగళం పాడి ప్రత్యేక ప్యాకేజి ఇస్తామంటే దాన్ని అర్ధరాత్రి మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి స్వాగతించగా "...గత 3 సంవత్సరాల 9 నెలల కాలంలో నా ప్రభుత్వం కఠినమైన మరియు అలుపెరుగని కృషి చేసింది..." అనడం హాస్యాస్పదం. "... హామీలను త్వరితగతిన అమలు చేయాలనే ప్రజల డిమాండును పునరుద్ఘాటిస్తున్నాను" అని చెప్పడం కాదు. వాటిని సాధించడం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏం చేస్తోంది, ఎలాంటి వైఖరిని చేపడుతోంది పేర్కొనకపోవడం బిజెపి, టిడిపిల దోబూచులాటకు అద్దం పడుతోంది. కడప స్టీల్‌ప్లాంటు, వైజాగ్ – చెన్నై పారిశ్రామిక కారిడార్, మెట్రోరైలు తదితర సమస్యల కంటే శాసన సభలో సీట్లను పెంచడం గురించి ప్రసంగంలో ముందుగా పేర్కొన్నారంటే ఈ ప్రభుత్వ ప్రాధాన్యతలు ఎలా ఉన్నాయో ఇట్టే బోధపడుతుంది.

రాష్ట్ర రాజధాని నడిబొడ్డున ఒక శాసనసభ్యుడు భూకబ్జాకు పాల్పడ్డారని మీడియా కోడై కూస్తుంటే "రౌడీయిజాన్ని పూర్తిగా అదుపులోకి తీసుకురావడమైందని" గవర్నర్ పేర్కొనడం కొండంత అబద్ధం. "పోలీసులు కనబడకుండా, పోలీసింగ్ కనబడేవిధంగా" అంటే గవర్నర్ దృష్టిలో ప్రజాసమస్యలపై ఆందోళన చేస్తున్న వామపక్షాలు, ప్రతిపక్షాలకు చెందిన నాయకులు, కార్యకర్తలను ముందస్తు అరెస్టులు, గృహ నిర్బంధాలకు పాల్పడడమేనేమో! సంక్షేమం గురించి సుదీర్ఘంగా ఏకరువు పెట్టిన గవర్నర్ ప్రభుత్వ పథకాలకు అన్ని విధాలా అర్హులైన పేదలను అడ్డుకుంటూ రాజ్యాంగేతర శక్తులుగా వ్యవహరిస్తున్న జన్మభూమి కమిటీల గురించి ప్రస్తావించకపోవడం గర్హనీయం.

2016, 2017ల్లో వర్షపాతం భారీ లోటులో ఉన్నా, ఎరువుల వినియోగం తగ్గిపోయినప్పటికీ ఆహారధాన్యాల ఉత్పత్తి మాత్రం పెరుగుతుందనడం అర్థరహితం. ఈ ఏడాది ఇచ్చిన వ్యవసాయ రుణాలు రూ.63,000 కోట్లలో కౌలుదార్లకు అతి స్వల్పంగా 2,326 కోట్లు (3.7 శాతం) ఇచ్చారు. అయినా కౌలుదార్లకు రుణాలను మూడేళ్ళలో ఎనిమిది రెట్లు పెంచామని చెప్పుకోవడం ప్రజలను మోసగించడమే. కౌలుదార్లకు పంటరుణాల్లో 10 శాతం ఇస్తామని టిడిపి ఎన్నికల ప్రణాళికలో హామీ ఇచ్చి నాలుగేళ్ళనాటికి అందులో 3 వంతు మాత్రమే అమలు చేసింది. రాష్ట్రంలో విద్యుత్ స్థాపిత సామర్ధ్యం రెట్టింపైందని చెప్పుకున్న ప్రభుత్వం వ్యవసాయ పంపుసెట్లకు కనీసం తన ఎన్నికల హామీ మేరకు 9 గంటల సరఫరాను సైతం అమలు చేయకపోవడం క్షంతవ్యం కాదు. ఉపాధి హామీ అంటే ఎన్ని వ్యవసాయ కార్మిక, పేద రైతు కుటుంబాలకు పని కల్పించారో అందులో చట్టం ఇచ్చిన హామీ ప్రకారం వంద రోజుల పని ఎంత మందికిచ్చారో చెప్పకుండా ఆ నిధుల నుండి ఎన్ని భవనాలు, సి.సి.రోడ్లు నిర్మించారో పేర్కొనడం ద్వారానే "ఉపాధి"ని ఈ సర్కారు కాంట్రాక్టర్లకు ఎలా అప్పగించిందో విదితం చేస్తోంది.

సమాజంలో సగభాగంగా ఉన్న మహిళలకోసం మొత్తం 147పేరాల ప్రసంగంలో కేవలం రెండు పేరాలు మాత్రమే కేటాయించడంలోనే ఈ ప్రభుత్వానికి మహిళలు, వారి సమస్యలపట్ల ఏపాటి శ్రద్ధ ఉన్నదో విదితమవుతుంది. అదే సమయంలో రియల్ టైమ్ గవర్నెన్స్ అంశానికి 8 పేరాలు కేటాయించడం గమనార్హం. గరగపర్రు (ప.గోదావరి), పెదగొట్టిపాడు (గుంటూరు), మహాభారతం (చిత్తూరు) తదితర ఘటనల్లో దళితులపై యదేచ్ఛగా దాడులు జరపడం, సాంఘిక బహిష్కరణలకు గురి చేస్తుంటే వాటిని అరికట్టే చర్యల గురించి గవర్నర్ ప్రసంగంలో ఒక్క మాట కూడా లేదు. విషజ్వరాలు, అంతుబట్టని వ్యాధులతో గిరిజనులు పిట్టల్లా రాలిపోతుంటే వాటి గురించి గవర్నర్ అసలు ప్రస్తావించనే లేదు. యువతను ఊరించిన నిరుద్యోగ భృతి గురించి గవర్నర్ పేర్కొననేలేదు.

**(పెనుమల్లి మధు)**
రాష్ట్ర కార్యదర్శి